

కీర్తిసింహుడి కథ

పూర్వం కోసలదేశాన్ని సుషేణుడనే మహారాజు పరిపాలిస్తుండేవాడు. అయనకు జయసేనుడనే ఆప్తమిత్రుడొకడున్నాడు. జయసేనుడు రాజుకు కేవలం మిత్రుడే కాక, ఆంతరంగిక సలహాదారు కూడా. చదరంగ ప్రియుడైన రాజు, తనతో సమఉజ్జీ అయిన జయసేనుడితో తరుచు చదరంగం ఆడుతూండేవాడు.

ఒకసారి రాజుతో చదరంగం ఆడి గెలిచిన జయసేనుడు నవ్వుతూ, "ఏమిటో సృష్టి వైచిత్రి! మహారాజులైన తమను ఓడించినప్పటి, ఈ ఆనందం కంటే, నా కుమార్తె చేతిలో ఓడినప్పటి ఆనందం, వెయ్యి రెట్లు ఎక్కువ!" అన్నాడు.

జయసేనుడి ఏకైక సంతానం శక్తిసేన ఎంతో అందమైనదేగాక, గుణవంతురాలూ, మేధావీ అని అప్పటికే వినివున్న రాజు, ఆ సంగతులేమీ ఎరగనట్టే, "ఏమిటీ, నీకుమార్తెకు చదరంగంలో అంతటి ప్రావీణ్యత వున్నదా?" అని, ఆశ్చర్యం నటిస్తూ అడిగాడు.

"ఆహా! కావలిస్తే తమరు స్వయంగా పరీక్షించవచ్చు," అని పితృగర్వంతో తీవిగా బదులిచ్చాడు జయసేనుడు.

"తప్పకుండా! రేపు రాత్రే నేను మీ ఇంటికి వచ్చి, నీ అతిథి సత్కారమూ, నీ కుమార్తె చదరంగ ప్రావీణ్యమూ ఎంతటిదో చూసి సంతోషిస్తాను," అన్నాడు మహారాజు నవ్వుతూ.

"మహాప్రసాదం!" అన్నాడు జయసేనుడు.

అన్న ప్రకారం మర్నాడే వెళ్ళి, శక్తిసేనతో చదరంగం ఆడాడు మహారాజు.

లక్ష్మీ గాయత్రి



అతి చురుకుగా పావులు కదుపుతూ వచ్చిన శక్తిసేన, అవలీలగా రాజు మూడు ఆటలూ కట్టివేసింది.

శక్తిసేన చురుకుదనానికీ, విజ్ఞానకాంతులు వెదజల్లుతున్న ఆమె సౌందర్యానికీ ముగ్ధుడయ్యాడు మహారాజు.

తర్వాత ఆయన, జయసేనుడి ఆతిథ్యాన్ని స్వీకరిస్తూ, "శక్తిసేన వంటి కుమార్తెకు తండ్రివైనందుకు నిన్ను అభినందిస్తున్నాను, జయసేనా! కాకపోతే, ఆమే పురుషుడై వుంటే, మరింత బాగుండేది!" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

ఆ మాటకు జయసేనుడు, "మీ మాట కాదని అంటున్నందుకు మన్నించాలి! శస్త్రశాస్త్రాల్లో సమాన ప్రావీణ్యత గడించిన నా కుమార్తె కాలి గోటికి కూడా, ఏ పురుషుడూ సరి రాడు! వీరాధివీరులమని చెప్పుకునే, ఎంతమంది పురుషుల కంటే కూడా అధికురాలైన నా కుమార్తె, స్త్రీ అయినందుకే నేను సంతోషిస్తున్నాను," అన్నాడు.

ఆ జవాబుకు రాజు కాస్త పౌరుషం తెచ్చుకుని, "అయితే, నా కుమారుడు కీర్తిసింహుడి కంటే, నీకుమార్తె ఘనురాలంటావు, అవునా?" అని ప్రశ్నించాడు.

ఊహించని ఆ ప్రశ్నకు జయసేనుడు కంగారుపడి, ఏదో అనబోయాడు. అయితే, రాజు అతణ్ణి వారించి, "కంగారుపడవలసిన అవసరం లేదు! నేను నీ కూతురికి ఒక పరీక్ష పెడతాను. ఆమె అందులో నెగ్గిందా, మెచ్చి కోడల్ని చేసుకుంటాను. ఓడిపోయిందా, కూతురుగా అభిమానించి అత్తవారింటికి సాగనంపుతాను. సరేనా?" అన్నాడు.

గత్యంతరం లేని జయసేనుడు, సరేనని అంగీకరించాడు.

"అయితే, ఇక విను! యువరాజు కీర్తిసింహుడు మన దేశానికి ఉత్తరాన వున్న ఆరావళీ పర్వత ప్రాంతంలో గల కృష్ణచంద్రుడి గురుకులంలో విద్యాభ్యాసం చేస్తున్నాడన్న విషయం నీకు తెలిసిందే గదా! కులగురువు మెచ్చిన విద్యార్థి అతడు. రాబోయే పౌర్ణమితో అతడి విద్యాభ్యాసమూ, యువరాజుకు కృష్ణచంద్రుడు ఇచ్చే ప్రత్యేక శిక్షణా పూర్తి అవు

తాయి. కృష్ణపాడ్యమినాడు ఒంటరిగా బయలుదేరి రాజధానికి తిరిగి వస్తున్నాడు. నీ కుమార్తె దారిలోనే అతణ్ణి అటకాయించి, తూర్పున వున్న అడవులవైపు మళ్ళించాలి. ఆ అడవుల్లో పురాతనమైన శక్తి ఆలయం ఒకటి వున్నదన్న సంగతి కూడా నీకు తెలిసిందే! ఆ ఆలయంలో మూడు రోజులపాటు కీర్తిసింహుణ్ణి బంధించి వుంచాలి. ఈ పని నీ కుమార్తె చెయ్యగలిగిందా, నా కోడల్ని చేసుకుంటాను. అయితే, ఒక్క నియమం! ఇదంతా నీ కుమార్తె ఒంటరిగా చెయ్యాలి. ఎవరి సహాయమూ తీసుకోరాదు. యువరాజును ఇంకెటూ మళ్ళించరాదు. ఇంకెక్కడా బంధించరాదు. ఏమంటావు?" అని అడిగాడు రాజు.



అంతా విన్న జయసేనుడికి మతిపోయినట్టయింది. ఒళ్లు చల్లబడింది.

ఒకటి, రెండు క్షణాలాగి జయసేనుడు చప్పున మహారాజు చేతులు పట్టుకుంటూ, "మహారాజా! పితృగర్వంతో నేనన్న మాటలను ఉపసంహరించుకుంటున్నాను. మమ్మల్ని క్షమించి వదిలిపెట్టండి. ఎంతైనా, ఆడపిల్లను ఇటువంటి పరీక్షకు గురిచెయ్యటం, తమకు భావ్యం కాదు," అని వేడుకున్నాడు.

మహారాజు గంభీరంగా, "అలాగా! ఏదీ, నీ కుమార్తెను ఇలా పిలిపించు!" అన్నాడు.

జయసేనుడు, శక్తిసేనను పిలిచాడు. మహారాజు స్వయంగా ఆమెకు అంతా చెప్పి, మృదువుగా, "అమ్మా, మీ నాన్నకు పితృగర్వమే కాదు, పితృభీతి కూడా అధికమే! అందుకే నిన్నడుగుతున్నాను; నా ప్రతిపాదన నీకు అంగీకారమేనా?" అని ప్రశ్నించాడు.

శక్తిసేన తలవంచుకుంటూ, "అంగీకారమే!" అన్నది.

కుమార్తె సమాధానం విని జయసేనుడు స్తంభించిపోయాడు. మహారాజు మాత్రం చిరునవ్వు నవ్వుతూ, జయసేనుడి భుజం తట్టి, రాజప్రాసాదానికి వెళ్ళిపోయాడు.

మహారాజు వెళ్ళిపోగానే శక్తిసేన, తండ్రి దగ్గరకు వచ్చి కూర్చుంటూ, "ఇందులో అంత భయపడవలసిందేమీ లేదు, నాన్నా!" అన్నది ఓదార్పుగా.



కూతురు మాటలతో జయసేనుడు ఆవేశపడుతూ, "అంగీకరించిన తర్వాత, తప్పని సరిగా అనుకోవలసిన మాట, అదేనమ్మా! కాకపోతే, తండ్రిగా నేనామాటలు అనుకోలేక పోతున్నాను. కీర్తిసింహుడు ఎటువంటివాడో, నాకు బాగా తెలుసు. కృష్ణచంద్రుడంతటి గొప్ప గురువుకు ప్రీతిపాత్రుడైన శిష్యుడతను. రాజనీతిలోనే కాదు, లౌకిక వ్యవహారాల్లోనూ, యుద్ధ విద్యల్లోనూ కూడా అతడికి సాటి ఎవ్వరూ లేరు. అటువంటి వ్యక్తిని మోసపుచ్చి, అరణ్య మధ్యంలో ఎక్కడికో తీసుకువెళ్ళి బంధించటానికి — అదీ ఒక్కతివే ఒంటరిగా! ఇందుకు ఒప్పుకున్నావంటే ఏమనాలి?" అన్నాడు.

శక్తిసేన, తండ్రి మాటలకు నిబ్బరంగా, "ఈ విషయాలన్నీ మహారాజుకు తెలిసినవే! అయినా, ఆయన మనకీ కఠినపరీక్ష ఎందుకు పెట్టారంటావు, నాన్నా?" అని ప్రశ్నించింది.

జయసేనుడు మరికాస్త ఆవేశంగా, "ఇంకెందుకు, నేను నిన్ను చూసుకుని అధికంగా పడుతున్న గర్వం వదలగొట్టడానికి, మహారాజు వేసిన ఎత్తు ఇది!" అన్నాడు.

శక్తిసేన నవ్వి, "అభిమానం మనిషి మనసును ఎంత బలహీనపరుస్తుందో, ఎలా పక్కదారులు పట్టిస్తుందో మిమ్మల్ని చూస్తే అర్థమవుతున్నది, నాన్నా! ప్రతి నీచభావానికీ ఒక ఉత్తమస్థితి వున్నది. విద్యార్థి మరొక మంచి విద్యార్థిని చూసి అసూయపడి, తనూ వాడిలా తయారవాలని పోటీపడడం, ఈర్ష్య, అసూయ అనే నీచ భావాల ఉత్తమస్థితి! అలాగే పితృగర్వమనేది, గర్వభావానికి ఉత్తమ స్థితి! ఇటువంటి ఉత్తమ స్థితుల్ని నశింప జెయ్యాలని చూసేవాడు, అధముడు. మహారాజు అటువంటి అధముడని, నేననుకోను. ఆయన ప్రతిపాదన వెనుక ఏదో అంతరార్థమున్నదని, నా ఊహ. కాస్త ఆవేశం తగ్గించుకుని ఆలోచించి చూడండి!" అన్నది.


కూతురు మాటలకు తెల్లబోయిన జయసేనుడు, "నిజమే! మహారాజు, అంతటి అధముడు కాడు, అంతటి అధముడు కాడు," అని గొణుక్కుంటూ, మైకం వదలినవాడిలా తల విదిలించి, ఆలోచనలో పడ్డాడు.

కొద్దిసేపటి తర్వాత, జయసేనుడు తలెత్తి, కూతురును అప్యాయంగా చూస్తూ, "తొందర పాటు నుంచి నన్ను కాపాడావు, తల్లీ!" అని నిట్టూర్చి, "ఇంతకూ మన ఊహే నిజం అయే పక్షంలో, నీకు చాలా విషయాలు చెప్పాలి. చెబుతాను, శ్రద్ధగా విను," అంటూ ప్రారంభించి, ఇలా చెప్పసాగాడు:

ప్రస్తుతపు రాజు సుషేణుడికీ, మనకూ వున్న మిత్రత్వం ఈనాటిది కాదు! తరతరాలుగా మన కుటుంబీకులు, కోసల రాజులకు అప్తమిత్రులుగానూ, ఆంతరంగిక సలహాదారులుగానూ వ్యవహరిస్తున్నారు. దీనికి ప్రారంభం, మా తాతగారి ముత్తాత కాలంలో జరిగింది. ఆయన పేరూ నా పేరే — జయసేనుడు! ఆయన బహువిధ ప్రజ్ఞగలవాడు. ముఖ్యంగా మంత్రవిద్యను కరతలామలకం చేసుకున్న వ్యక్తి. అప్పట్లో ఆయనను మించిన మంత్ర శాస్త్రజ్ఞుడు దేశ దేశాలు వెతికినా కనిపించేవాడు కాదు!

అప్పటి మహారాజు విచిత్రవర్మకు మంత్ర శాస్త్రమంటే ప్రత్యేకాభిమానం వుండేది. ఆయన ఆ విద్యలో కొంత కృషి చేశాడు కూడా. జయసేనుడి మంత్ర విద్యా ప్రావీణ్యత గురించి విన్న విచిత్రవర్మ, కోరి అతడితో మైత్రి చేసుకుని, తన ఆంతరంగిక సలహాదారు పదవిలో నియమించి గౌరవించాడు. సకల శాస్త్ర పారంగతుడూ, ధర్మమూర్తి అయిన మహారాజుతో స్నేహం జయసేనుడికి అమితానందాన్నీ, తృప్తినీ ఇచ్చింది. కొద్ది కాలంలోనే వాళ్ళిద్దరూ ప్రాణ స్నేహితులయ్యారు. మహా





రాజు కోసం, తన ప్రాణం అయినా ఇవ్వటానికి సిద్ధంగా వుండేవాడు.

జయసేనుడి మంత్రవిద్య సహాయంతో విచిత్రవర్మ, జయసేనులిద్దరూ అదృశ్యరూపంలో రాజ్యంలో సంచరిస్తూ, ప్రజల కష్టసుఖాలు గమనిస్తూండేవారు. దొంగలనూ, దుర్మార్గులనూ పట్టుకుని శిక్షించేవారు. కష్టాలలో వున్న వాళ్ళను ఆదుకునేవారు.

ఈవిధమైన పాలనలో కోసల సుభిక్షమై, ప్రజలు అంతులేని సుఖ సంతోషాలతో జీవిస్తూండేవారు. దొంగలకూ, దోపిడీదారులకూ మహారాజంటే సింహస్వప్నంగా వుండేది.

ఇలా వుండగా — ఒకసారి మహారాజు పుట్టినరోజుకు, జయసేనుడు ఒక ముత్యాల హారాన్ని బహుమతిగా ఇచ్చాడు. అది మామూలు ముత్యాలహారం కాదు. జయసేనుడి చేతిలో అద్భుతమైన మంత్రశక్తులను నిక్షిప్తం చేసుకుని తయారైన అపురూప హారం! పూర్తిగా మంచి ముత్యాలతో తయారుచెయ్యబడిన ఆ హారానికి, నవరత్న ఖచితమైన పతకం అమర్చబడింది.

స్వర్ణకారుడు మామూలుగా తయారుచేసి ఇచ్చిన ఆ హారంలో, తన సర్వశక్తులూ వినియోగించి, మూడు అద్భుత శక్తులను నిక్షిప్తం చేశాడు జయసేనుడు. ఆ హారం ధరించిన వ్యక్తి, కావాలనుకున్నప్పుడు అదృశ్యంగా సంచరించగలడు. ఇది మొదటి శక్తి. రెండవది, అతడికి ఎదుటి వ్యక్తి చెబుతున్నది నిజమో, అబద్ధమో తెలుస్తుంది. మూడవదీ, అత్యంత ఆకర్షణీయమైనదీ ఏమంటే, ఆ హారం ధరించిన వ్యక్తికి భూమిలో నిక్షిప్తమై వున్న నిధి నిక్షేపాలు కనిపిస్తాయి. మహారాజు మీద తనకు గల గౌరవం, అభిమానం ఆ పనికి పురికొల్పగా, ఆ హారాన్ని తయారుచేశాడు జయసేనుడు.

జయసేనుడు తనకు బహూకరించిన హారం ప్రాముఖ్యత వినగానే, అతడికి తనపై గల విశ్వాసానికీ, అభిమానానికీ చలించిపోయాడు మహారాజు.

కొన్నాళ్ళు గడిచాయి. ఒకసారి, జయసేనుడు బహూకరించిన హారం ధరించి, కోసలకు తూర్పున వున్న అడవుల్లో పరివారం



వెంటరాగా వేటకు వెళ్ళాడు, విచిత్రవర్మ. ఏదో అనారోగ్య కారణంగా జయసేనుడు మహారాజుతో పాటు వెళ్ళక, నగరంలోనే వుండి పోయాడు.

పగలంతా అడవిలో వేట సాగించి, రాత్రికి అక్కడే అందరూ, మహారాజుతో పాటు గుడా రాలు వేసుకుని విశ్రమించారు.

కాపలా భటులు తప్ప మిగతా పరిజనం అంతా నిద్రపోయినా, మహారాజుకు మాత్రం నిద్రపట్టలేదు. ఆయనకు ఏదో తెలియని ఆనందం, ఆవేదన కలగసాగాయి. అశాంతిగా గుడారంలోంచి బయటికి వచ్చి, గమ్యం తెలియనివాడిలా అటూ ఇటూ తిరగసాగాడు. మహారాజు వింత చర్యకు విస్తుబోతూ భటులు కూడా, మహారాజును అనుసరించారు.

చివరికి ఒకచోట ఆగిపోయిన విచిత్రవర్మ, తక్షణం అక్కడ తవ్వవలసిందిగా భటులను ఆజ్ఞాపించాడు.


మరికొద్దిసేపట్లో కాగడాల వెలుతురులో, ఆ ప్రదేశం పట్టపగలులా మారింది. తవ్వకాలు ప్రారంభమయ్యాయి. రాత్రికి రాత్రి ఆ అడవిలో అలా ప్రారంభమైన, ఆ తవ్వకాలు మర్నాటి మధ్యాహ్నం వరకూ నిర్విరామంగా సాగాయి.

ఆ మధ్యాహ్నానికి, ముక్కున వజ్రపు ముక్కెరతో, నిలువెత్తు నల్లని శక్తి విగ్రహం ఒకటి బైటపడింది. మహారాజుకు ఆ విగ్రహాన్ని చూడగానే ఆనందమూ, ఆవేదనా రెట్టింపు అయ్యాయి. తనను తాను నిబ్బరించుకుంటూ, విగ్రహాన్ని తక్షణం రాజధానికి తరలించవల సిందిగా ఆజ్ఞాపించాడు.

కాని, అదృష్టమో, దురదృష్టమో — అక్కడ విచిత్రవర్మతో బాటు వున్న ప్రహ్లాదుడనే మంత్రి, రాజు ప్రయత్నం సాగనివ్వలేదు. ఆగమ శాస్త్రవేత్తలూ, తాంత్రికులూ వచ్చి చూసి చెబితే తప్ప, ఆ విగ్రహాన్ని అక్కడినుంచి కదిలించడం ఏమాత్రం మంచిది కాదని సలహా ఇచ్చాడు.

అయిష్టంగానే మంత్రి సలహాను అంగీకరించిన విచిత్రవర్మ, కొందరు భటులను అక్కడ కాపలాగా నియమించి రాజధానికి ప్రయాణం కట్టాడు. — (ఇంకావుంది)






కీర్తిసింహుడు కథ

[కోసలరాజు సుషేణుడికి జయసేనుడు ఆప్తమిత్రుడు. ఆయన కుమార్తె కీర్తిసేన. కీర్తిసేన శక్తిసామర్థ్యాలను పరీక్షించడానికి రాజు, ఆమెను అరావళీ పర్వతాలకు వెళ్ళి, విద్యాభ్యాసం ముగించుకుని వస్తూన్న యువరాజు కీర్తిసింహుణ్ణి దారి మళ్ళించమని కోరాడు. కీర్తిసేన అందుకు అంగీకరించింది. మొదట కంగారుపడిన జయసేనుడు తేరుకుని, కుమార్తెకు రాజు కోరిక ఆంతర్యం గురించీ, తమ పూర్వీకుల గురించీ వివరించసాగాడు: విచిత్రవర్మకు జయసేనుడు అద్భుతశక్తులు గల ముత్యాలహారాన్ని బహూకరించాడు. వేటకు వెళ్ళిన విచిత్రవర్మకు భూగర్భంలో ఒక శక్తి విగ్రహం కనిపించింది. దానిని గురించి ఆగమవేత్తలను సంప్రదించడానికి రాజు రాజధానికి తిరిగివచ్చాడు. — తరవాత]

రాజు విచిత్రవర్మ రాజధాని చేరుతూనే ఆయన కలుసుకున్న మొట్టమొదటి వ్యక్తి జయసేనుడు. రాజు చెప్పినదంతా విన్న జయసేనుడు కూడా, ఏదో తెలియని ఆనందమూ, ఆవేదనా అనుభవించాడు.

ఆతర్వాత, అనేక తర్జనభర్జనలూ, మీమాంసలూ జరిగి, చివరకు జయసేనుడితో సహా అందరూ తేల్చి చెప్పినది ఇది: ఇప్పట్లో ఆ శక్తి విగ్రహాన్ని అక్కడినుంచి కదిలించడం మంచిది కాదు. అక్కడే ఆలయం కట్టించి, విగ్రహ ప్రతిష్ఠాపన చెయ్యాలి. ఆ దేవత అనుగ్రహం కాని, ఆ విగ్రహం దొరికిన లాభం కాని, ప్రస్తుత మహారాజైన విచిత్రవర్మకు దక్కవు! రాబోయే తరంలో విచిత్రవర్మకు వారసుడైన ఒకానొక వీరుణ్ణి, ఆ దేవి కరుణిస్తుంది. అతడు ఆ దేవి కృపవల్ల రాజ్యవ్యాప్తి చేసి, దక్షిణాపథానికంతటికీ సార్వభౌముడవుతాడు. అతడి కీర్తి దిగంతాల వ్యాపిస్తుంది.

లక్ష్మీగాయత్రి



అతడి పాలనలో ఈ దేవత కూడా, ఒకానొక ప్రసిద్ధనామంతో, నిత్యపూజలు అందుకోవడమేకాక, ఎంతో మహిమగల దేవతగా ఉత్సవాలూ, ఊరేగింపులూ జరుపుకుంటుంది!

ఇదంతా విన్న తర్వాత విచిత్రవర్మ, ఆ నాటి రాత్రి తనకు ఆనందమూ, ఆవేదనా ఒకేసారి ఎందుకు కలిగాయో గ్రహించాడు. చివరకు ఆయన బాధపడటం మానేసి, తన వంశస్థుడు అంతటి పేరుప్రతిష్ఠలకూ, గొప్పతనానికీ కారకుడు కాబోతున్నందుకు ఎంతో సంతోషించి — శక్తి విగ్రహానికి అక్కడ అడవిలోనే గుడి కట్టించి అందులో ప్రతిష్ఠించాడు. అయితే, అడవిలో వున్న ఆ గుడికి వెళ్ళి పూజలు చేసేవారు ఎవరూ లేకపోయారు. కొంతకాలం గడిచేసరికి ప్రజల్లో ఆ గుడి సంగతి మరుగున పడటం ప్రారంభమైంది.

ఇదంతా దైవలీలగా భావించిన విచిత్రవర్మ, మనసులోనే శక్తికి నమస్కరించి వూరుకున్నాడు.

అలా కొన్ని సంవత్సరాలు గడిచాయి. హారం సహాయంతో విచిత్రవర్మ కనీవినీ ఎరుగనంత చక్కగా రాజ్యపాలన చేశాడు. తన రాజ్యంలో ఒకటి, రెండు చోట్ల భూమిలో వున్న నిధులను వెలికితీసి, అనేక ప్రజోపయోగ కార్యాలు చేశాడు. దానితో ఆయన పేరు దేశదేశాలు మారుమోగిపోయింది. అంతేకాక, మొదట్లో గుప్తంగా వుంచబడిన ముత్యాల హారం మహిమ కూడా నెమ్మదిగా ఆనోటా ఈనోటా పడి, విస్తరించి, విచిత్రవర్మ పేరుతో పాటు, అతడి గొప్పదనానికి మూలకారణమైన వస్తువుగా దశదిశలా పేరు పొందింది. దానితో పాటే బాధలు కూడా ప్రారంభమయ్యాయి.

దక్షిణాపథంలో నాటికీ నేటికీ కూడా అత్యంత బలమైనదీ, సుభిక్షమైనదీ కోసల రాజ్యం. కోసల తర్వాత కాంభోజ, నగ దేశాలు దక్షిణాపథ రాజ్యాల్లో పెద్దవి. కాంభోజ దేశం, కోసలకు తూర్పున వున్నది. ఆ దేశానికీ కోసలకూ మధ్య గల సరిహద్దు అడవుల్లోనే శక్తి ఆలయం వున్నది.

అప్పట్లో కాంభోజను పరిపాలించిన చక్రాదిత్యుడు స్వతహాగా మంచివాడే గాని, అసమర్థుడు. అతడి పాలనలో ప్రజలు అనేక రకాల

బాధలు చవిచూశారు. వారి బాధామయ జీవితాల మధ్య విచిత్రవర్మ పాలనా, కోసల ప్రజల సుఖజీవితాలూ గురించి కథలుగా చెప్పుకునేవారు. క్రమంగా కాంభోజ ప్రజలు కూడా కోసలకు వలస రావటం ప్రారంభించారు. దయాళుడైన విచిత్రవర్మ పాలనలో వారికి ఆదరణా, సుఖశాంతులతో కూడిన జీవితమూ లభించాయి.

ఈ పరిస్థితుల్లో విచిత్రవర్మ, జయసేనుడు, అటు చక్రాదిత్యుడు కూడా వృద్ధులయ్యారు. విచిత్రవర్మ పెద్ద కుమారుడైన జయవర్మ ఇక్కడ కోసల సింహాసనాన్ని అధిష్ఠించాడు. అక్కడ చక్రాదిత్యుడి జ్యేష్ఠ పుత్రుడు కూడా రాజు కావలసి వున్నది. కాని అతడు కూడా అసమర్థుడు కావటం వల్ల, పరిస్థితులన్నీ గమనిస్తున్న చక్రాదిత్యుడి రెండవ కుమారుడు వరుణదత్తుడు, తండ్రినీ, అన్ననూ బందీలుగా చేసి, రాజ్యాధికారం హస్తగతం చేసుకున్నాడు. అసమర్థుడి పాలనతో విసిగిపోయిన రాజోద్యోగులూ, ప్రజలూ కూడా అతడికి సహాయం చేశారు.

అయితే, తండ్రి, అన్న అసమర్థులైతే వరుణదత్తుడు ఒకరకమైన మూర్ఖుడు! అతడు కోసలరాజు ఔన్నత్యం గురించి ప్రజలు గొప్పగా చెప్పుకోవటమూ, వాళ్ళు వెళ్ళి అతణ్ణి ఆశ్రయించటమూ భరించలేకపోయాడు. తన రాజ్యం కంటే కోసల ఉన్నతస్థితిలో వుండటానికి కేవలం, జయసేనుడు కోసలరాజుకు



తయారుచేసి ఇచ్చిన అపూర్వహారమే కారణమని దృఢంగా నమ్మిన వరుణదత్తుడు, ఆ హారాన్నికుయుక్తితో సంపాదించి, తన రాజ్యాన్ని కోసలతో సరితూగేలా చెయ్యాలని నిర్ణయించుకున్నాడు. తక్షణమే, ఆ హారం సంపాదించటానికి, ఒక పథకం కూడా రూపొందించాడు. ఆ పథకానికి దారితీసినదీ, తోడ్పడినదీ కోసల రాజు జయవర్మ ప్రవర్తనే!

జయవర్మ మంచివాడు, సమర్థుడు. అయితే, విలాసపురుషుడు! చిత్ర విచిత్రాలైన విలాస మందిరాలను నిర్మించటమూ, దేశ విదేశాలనుంచి వచ్చిన నర్తకీమణుల నాట్యాలు చూసి, వారికి బహుమానాలిచ్చి తిరిగి సాగనంపటమూ, అతడికి అత్యంత ప్రీతిపాత్రమైన



పనులు. ఈరకమైన అతడి ప్రవర్తన, తండ్రి విచిత్రవర్మకు బాధాకరమూ, ప్రజల్లో చెడు పేరుకూ కారణమైంది.

ఇవన్నీ తెలుసుకున్న కాంభోజ రాజు వరుణదత్తుడు, కనకలత అనే నర్తకిని కార్యసాధన కోసం ఎంచుకున్నాడు. అత్యంత సౌందర్యవతి అయిన కనకలత, తన చతురతతో జయవర్మ దగ్గరి నుంచి అపూర్వ హారాన్ని తీసుకువచ్చి, వరుణదత్తుడికిచ్చి, అతడు ఇచ్చే బహుమానాలను తీసుకోవడానికి అంగీకరించింది.

అయితే, ఇక్కడే వరుణదత్తుడికి తెలియని విషయం ఒకటున్నది! మహారాజు విచిత్రవర్మ కొడుకుకు పట్టం కట్టినా, రాజ్య వ్యవహారం నుంచి పూర్తిగా వైదొలగలేదు. కొడుకు ప్రవర్తనలోని లోటుపాట్లు తెలిసిన విచిత్రవర్మ, జయవర్మకు కూడా తెలియకుండా, రహస్యంగా తనకొక గూఢచారి దళం ఏర్పాటుచేసుకుని వార్తలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే వున్నాడు. అయితే, సింహాసనం అధిష్ఠించిన రోజున మహారాజు, కొడుకు మెడలో వేసిన అపూర్వ హారం మాత్రం జయవర్మ దగ్గరే వున్నది.

వరుణదత్తుడు పంపిన కనకలత కోసలలో అడుగుపెట్టిన మరుక్షణం, ఆ వార్త విచిత్రవర్మకు చేరింది. ఏదో తెలియని అనుమానంతో విచారణ సాగించిన మహారాజుకు, కనకలత రాకవెనకవున్న కుతంత్రం యావత్తూ తెలియవచ్చింది.

ఆ వార్త విని ఆందోళన చెందిన మహారాజు, వెంటనే జయసేనుడితో సంప్రతించాడు. ఇద్దరూ కలిసి ప్రతివ్యూహం తయారు చేశారు. క్షణాల మీద అచ్చు గుద్దినట్టు అటువంటిదే మరొక హారం తయారైంది. నమ్మకమైన వ్యక్తి ద్వారా కృత్రిమ హారం జయవర్మ మెడలోకీ, అసలు మహిమ గల హారం మహారాజు మెడలోకీ చేరాయి.

ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే కనకలత, తన హావభావవిన్యాసాలతో, చాతుర్యంతో రాజును పరవశింపజేసింది. జయవర్మ ఆనందంతో నిలుచున్నపాటుగా తన మెడలోని ముత్యాలహారాన్ని కనకలత మెడలో వెయ్య





టమూ, ఆ రాత్రికి రాత్రే కనకలత నగరం వదిలివెళ్ళిపోవటమూ జరిగిపోయాయి.

తను చేసిన ఘోర తప్పిదం తెలిసివచ్చిన జయవర్మ, ఉన్నపాటుగా తండ్రి దగ్గరకు పరుగెత్తుకు వెళ్ళాడు.

అతడు వెళ్ళేసరికి విచిత్రవర్మ, జయసేనుడితో చదరంగం ఆడుతున్నాడు. తండ్రితో పాటు వున్నది జయసేనుడే గనుక, జయవర్మ దాపరికం లేకుండా తాను చేసిన తప్పు ఇద్దరికీ చెప్పి, తిరిగి హారాన్ని సంపాయించే మార్గం ఆలోచించమని కోరాడు.

అంతా విని నిట్టూర్చిన విచిత్రవర్మ, కొడుకుతో, "ఆ హారం ఒకసారి మన వంశీకుల చెయ్యి దాటి మరొకరి కంఠాన్ని అలంకరించటమంటూ జరిగితే, ఆ మరుక్షణం దాని ప్రభావాన్ని కోల్పోతుంది, నాయనా! అందుచేత, ఇక దాన్ని గురించి మరిచిపోవటం ఉత్తమం!" అన్నాడు.

అతడి మాటలు విని జయవర్మతో పాటు జయసేనుడు కూడా ఆశ్చర్యపోయాడు. జయవర్మ మనసు కాస్త తేలికపడినా, అంతటి అపూర్వ హారాన్ని పోగొట్టుకున్న బాధతో ఏదో చెప్పబోయాడు.

విచిత్రవర్మ, కొడుకును వారిస్తూ, "రసికహృదయుడైన రాజు, తన కళాభిమానంతో కళాకారుల్ని ఆనందింపజెయ్యాలే గాని, తాను ఉన్మత్తుడు కారాదు! రాజు తన మనసును పూర్తిగా కేంద్రీకరించవలసింది ప్రజల కష్టసుఖాల మీద గాని, సొంత సుఖాల మీద కాదు. తామరాకు మీద నీటిబొట్టు చందంగా విలాసాలనుఅనుభవించగలిగినవాడేఉత్తముడైనరాజు! ఇక వెళ్ళిరా!" అన్నాడు.

జయవర్మ బాధావమానాలతో తల వంచుకుని వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళిన తర్వాత జయసేనుడి ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూస్తూ విచిత్రవర్మ, "నేను అబద్ధం ఎందుకు చెప్పానా అని ఆలోచిస్తున్నావా, జయసేనా? ఒక్క విషయంచెప్పు! జయవర్మ దగ్గరినుంచి హారాన్ని అడిగి తీసుకోవాలని మనం ఎందుకు తొందరపడినట్టు?" అని ప్రశ్నించాడు.

జయసేనుడు ఆ ప్రశ్నకు జవాబు చెప్పక మౌనం వహించాడు.

అప్పుడు విచిత్రవర్మ చిన్నగా తలపం కించి, "నీకు తెలుసు, జయసేనా! ఆ హారం మెడలో వుంటే, కాంభోజ నర్తకి మాటల్లోని అసత్యం, కపటం జయవర్మకే తెలుస్తాయి! అతణ్ణి వంచించి ఆ హారం తీసుకువెళ్ళటం అన్న ప్రసక్తే రాదు. ఇదంతా కాంభోజ రాజుకూ తెలుసు! అయినప్పటికీ అతడు ఆ పథకం వేశాడు. మనం హారాన్ని జయవర్మ మెడ లోంచి తప్పించాం. ఇదంతా ఎందుకు జరి గింది? జయవర్మ మనోదౌర్బల్యం వల్ల. అతడి ఉన్మత్త ప్రవర్తన వల్ల. దుర్బలుడూ, ఉన్మత్తక్రియలతో సంచరించేవాడూ, భగవ త్ప్రసాదితమైన మేధాశక్తినే కోల్పోతాడు. సహజ మైన మానసిక శక్తులకు పదునుగా చెప్పబడే, ఈఅతీంద్రియ శక్తులనుసరిగా ఉపయోగించు కోలేడు. మూర్ఖుడైనప్పటికీ వరుణదత్తుడు ఈ విషయాన్ని చక్కగా ఊహించాడు. అందు వల్లనే అతడు, కనకలత ద్వారా జయవర్మను మరింత దుర్బలుణ్ణి చేసి, హారం సంపాదించా లనుకున్నాడు, అవునా?" అన్నాడు.



జయసేనుడు మౌనంగా తలవూపి వూరు కున్నాడు.

విచిత్రవర్మ నవ్వి, "జయవర్మ మీద నా కంటే నీకే ఎక్కువ వాత్సల్యమని నాకు తెలుసు, జయసేనా! ఒకసారి దెబ్బతిన్న జయ వర్మ, ఇకనుంచి జాగ్రత్తగా వుంటాడనీ, హారం అతడికి తిరిగి ఇవ్వవచ్చుననీ, నీ ఆలోచన! కాని, ఇటువంటి విషయాల్లో అభిమానం కంటే బాధ్యతకూ, నమ్మకం కంటే అపనమ్మకానికీ ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. దుర్బల స్వభావుడైన జయవర్మ, ఈ సంఘటనతో మారవచ్చు, మారకనూ పోవచ్చు! అటు వరుణదత్తుడికి తాను సంపా దిందించినది నకిలీ హారమనీ, అసలు హారం మనదగ్గరే వున్నదనీ తెలిస్తే, ఈసారి ఎటు వంటి ఘాతుకానికైనా ఒడిగడతాడు. ఇవన్నీ ఆలోచించే ఆ అబద్ధం చెప్పాను. ఇప్పుడు జయవర్మ, వరుణదత్తులిద్దరూ అసలు హారం శక్తి కోల్పోయిందనే అనుకుని దాన్ని గురించి మరిచిపోతారు. ఇక హారం సంగ తంటావా? దాన్నిగురించి కూడా ఒక దృఢమైన నిర్ణయం తీసుకున్నాను. ఎటూ మన ముందు

నా వంశంలో ఒక మహోన్నత వ్యక్తి ఉద్భవిస్తాడు. నువ్వు నాకు కానుకగా ఇచ్చిన ఈ హారానికీ, ఈ హారం ద్వారా నాకు లభ్యమైన దైవ సంపదకూ కూడా, అతణ్ణే వారసుణ్ణి కానీ!" అన్నాడు.

మహారాజు రాజనీతినీ, ధర్మప్రవర్తననూ మనసులోనే మెచ్చుకుంటూ, మౌనంగా మహారాజుకు అంగీకారం తెలిపాడు జయసేనుడు.

విచిత్రవర్మ ఊహించినట్టే, అతడు జయవర్మతో అన్న మాటలు వరుణదత్తుడిదాకా చేరాయి. హారం నిజంగానే శక్తి కోల్పోయిందని నమ్మిన అతడు బాధపడి పూరుకున్నాడు.

జరిగినదానితో చాలా విచారగ్రస్తుడైన జయవర్మలో మాత్రం పెద్ద మార్పు వచ్చింది. అతడు నానాటికీ విలాసాలు తగ్గించుకుని, బాధ్యతలు పెంచుకున్నాడు. కోసల ప్రజల్లో రాజు పట్ల అభిమానమూ, విశ్వాసమూ పెరిగాయి.

ఇదంతా తృప్తిగా చూసిన మహారాజు విచిత్రవర్మ, ఆ తర్వాత కొద్ది కాలానికి స్వర్గస్థుడయ్యాడు. విచిత్రవర్మ మరణించిన కొన్ని నెలల తర్వాత జయసేనుడు కూడా మరణించాడు. మరణించబోయే ముందు జయవర్మను కలుసుకున్న జయసేనుడు, అతడికి జరిగినదంతాపూసగుచ్చినట్టు చెప్పి, "నాయనా! నీలో వచ్చిన మార్పును గమనించి, నీకు హారం తిరిగి ఇవ్వమని మహారాజుకు చెప్పి చూశాను. కాని, ఆయన తన సంకల్పాన్ని విడిచిపెట్టలేదు. 'ఎందుకు కలిగిందో నాకు ఒకసారి ఒక సంకల్పం కలిగింది. ఇక దాన్ని మార్చుకోదలచుకోలేదు. నా నిర్ణయం అన్ని విధాలా మంచిదేనని, నా విశ్వాసం. ఇక ఆ విషయం వదిలెయ్యి, జయసేనా! ఆ హారం ధరించబోయే వ్యక్తి జయవర్మ కొడుకో, మనమడో అయినా కావచ్చు. హారం నా వంశాన్ని దాటి మరెక్కడికీ పోదు కదా!' అన్నారు. అంతేకాదు, ఆ హారం ఎక్కడ దాచారో కూడా నాకు చెప్పలేదు. ఈ ఉత్తరం మాత్రం నా చేత రాయించి, నేను మరణించేలోగా నీకు ఇవ్వమని చెప్పారు. ఇదిగో, ఆ ఉత్తరం!" అంటూ జయవర్మకు ఒకచిన్న దంతపు పెట్టె ఇచ్చాడు. — (ఇంకావుంది)





కీర్తిసింహుడి కథ

3

[విచిత్రవర్మ పండితుల సలహా ప్రకారం అరణ్యంలోనే గుడి కట్టించి, భూగర్భంలో లభించిన దేవీవిగ్రహాన్ని అందులో ప్రతిష్ఠించాడు. కొన్నాళ్ళకు విచిత్రవర్మ కుమారుడు జయవర్మ సింహాసనం అధిష్ఠించాడు. ఆయన దగ్గరున్న ముత్యాల హారాన్ని కాజేయాలని కాంభోజరాజు వరుణదత్తుడు పథకం వేసి, అందుకోసం ఒక నర్తకిని పంపాడు. విషయం గ్రహించిన విచిత్రవర్మ, ఉపాయంతో ఆ హారాన్ని కాపాడాడు. అయితే, ఆసంగతి జయవర్మకు తెలియదు. విచిత్రవర్మ మరణానంతరం, ఆయన రాయించిన ఒక ఉత్తరాన్ని జయసేనుడు జయవర్మకు తెచ్చి ఇచ్చాడు. — తరవాత]

జయసేనుడి మాటలు విని నిట్టూర్చిన జయవర్మ, "పోనివ్వండి, జయసేనా! ఇందులో నాన్నగారి తప్పేమీ లేదు. ఆయన నా మీద వుంచిన నమ్మకాన్ని, నేను నిలబెట్టుకోలేక పోయాను. ఆయన ఆ అపూర్వహారాన్ని ఎవరికీ దానం చెయ్యలేదు కదా! ఆయనకు వారసుడైె, దాన్ని అనుభవించబోయేవాడు, నాకు మాత్రం వారసుడు కాదా?" అని, ఆ ఉత్తరాన్ని పెట్టెలో నుంచి తీసి, ఇలా చదివాడు:

"నాయనా, జయా! జయసేనుడు అంతా చెప్పాడు గదా! నేను చేసిన పనికి, నువ్వు నా మీద ఆగ్రహించవని, నా నమ్మకం. ఆ నమ్మకంతోనే సాహసించాను!

ఇకపోతే ఆ హారం ఎక్కడ దాచానో నాకు తప్ప ఎవరికీ — చివరకు జయసేనుడికి కూడా తెలియదు. అది ఎక్కడ వున్నదో తెలుసుకోవటానికి, ఈ క్రింది ఆధారాలు మాత్రం వదలిపోతున్నాను!

లక్ష్మీగాయత్రి



రకరకాల వ్యాఖ్యానాలూ ప్రయత్నాలతో విసు గెత్తి పోయినవాళ్ళేగాని, సరైన అర్థం గ్రహించి, ఆ హారం సంపాదించినవాళ్ళు లేరు. కాని, అనేక తర్జనభర్జనల తర్వాత, ఆ హారాన్ని తూర్పుటడవుల్లో వున్న శక్తి ఆలయంలోనే ఎక్కడో పాతిపెట్టి ఉంటారని, మన మహారాజు సుషేణుడి తండ్రి నిశ్చయించాడు. కాని, ఆ ఆలయంలో తవ్వకాలు జరపబోయే సమయానికి ఆటంకాలు ఏవో ఏర్పడటంతో, ఆయన ఆ ప్రయత్నాన్నే విరమించుకున్నాడు. తర్వాత సింహాసనాన్ని అధిష్ఠించిన మన మహారాజు మాత్రం ఎందుకనో ఆ హారం కోసం ప్రయత్నమే చెయ్యలేదు!" అంటూ ఒక్కక్షణం ఆగి అలుపు తీర్చుకున్న జయసేనుడు, "కాని...." అంటూ తిరిగి ప్రారంభించి, "ఆ హారం లభించబోయే వ్యక్తి తన కొడుకు అయితే బాగుండునన్న ఆశ మహారాజుకు బాగా వున్నది. మహారాజుకు నీ మేధస్సు మీద మంచి గురి కుదిరినట్టున్నది. కీర్తిసింహుడి వంటి మేధాశాలికి, నీ వంటి తెలివిమంతు రాలు తోడైతే, ఇద్దరూ కలిసి ఈ కార్యాన్ని అవలీలగా సాధించగలరని, మహారాజు అభిప్రాయపడి వుంటాడు. కీర్తిసింహుణ్ణి తూర్పుటడవుల్లోని శక్తి ఆలయంలోనే బంధించమని మహారాజు నొక్కి చెప్పటం చూస్తే, నాకు అదే అనిపిస్తున్నది," అన్నాడు.

తండ్రి మాటలకు శక్తిసేన తలవూపుతూ, "అంతే అయివుంటుంది, నాన్నా! ఈ విషయం

జయా! సమస్తలోకాలకూ పూజనీయురాలైన పరమేశ్వరి కూడా స్త్రీయే! ఆమె తల వంచేది ఎవరి ముందు? ఆ వ్యక్తి నివసించేది ఏ దిక్కున? మనిషికి జీవనాధారమైన దాన్ని ప్రసాదించేదీ, పంచభూతాలలో ఒకటీ అయిన దేది? దాన్ని ఒక అడుగుగా కొలిచినవాడు అడిగిన మొత్తం ఎంత? నాయనా, ప్రాప్తంగల వాడికి పై ప్రశ్నలకు సమాధానాలు స్ఫురిస్తాయి! సమాధానాలు స్ఫురించినవాడికి లాభం ప్రాప్తిస్తుంది! నీకు సర్వశుభాలూ కలగాలని ఆశీర్వదిస్తూ, నీ తండ్రి విచిత్రవర్మ."

ఉత్తరం చదివిన జయవర్మ, దాన్ని కళ్ళకద్దుకుని తిరిగి దంతపు పెట్టెలో పెట్టేశాడు. ఐదు తరాలు గడిచినా, ఆ ఉత్తరం చదివి

గూఢంగా చెప్పటంద్వారా మహారాజు మనకు తొలి పరీక్ష పెట్టినట్టే!" అన్నది.

జయసేనుడు నవ్వి, "ఆ పరీక్షలో నువ్వు నెగ్గావు గదా, తల్లీ! నువ్వేగనక చెప్పకపోతే నాకీ ఆలోచన వచ్చివుండేదే కాదు," అన్నాడు.

శక్తిసేన చిరునవ్వు నవ్వి వూరుకున్నది.

మరునాడు జయసేనుడు, రాజప్రాసాదానికి వెళ్ళేసరికి భటులు, మహారాజు అంతరంగిక మందిరంలో జయసేనుడి కోసం ఎదురు చూస్తున్నట్టు వార్త అందించారు. జయసేనుడు వెంటనే అక్కడకు వెళ్ళాడు.

చిరునవ్వుతో తనకు నమస్కరిస్తున్న జయసేనుణ్ణి చూడగానే, మహారాజు మందహాసం చేసి, "ఏం, జయసేనా! నీ కుమార్తెను ఒంటరిగా పంపటానికి సిద్ధమేనా?" అని ప్రశ్నించాడు.

జయసేనుడు ఆ ప్రశ్నకు సిగ్గుపడుతూ నవ్వి, "నిన్న నేను తండ్రిగా కాస్త అతిగా ప్రవర్తించిన మాట నిజమే, ప్రభూ! అయితే, మీరు వెళ్ళిన తర్వాత, నా కుమార్తె మాటలతో, మీ అభిప్రాయం గ్రహించగలిగాను. నేనూ, నా కుటుంబం సర్వదా మీ సేవకు సంసిద్ధులం. నా కుమార్తె శక్తిసేన, శుక్ల చతుర్దశి నాడే బయలుదేరి వెళ్ళి, మార్గమధ్యంలోనే రాకుమారుణ్ణి కలుసుకుని, తాను చెయ్యగలిగినదంతా చేస్తుంది," అన్నాడు.

జయసేనుడి మాటలు విన్న సుషేణుడు గంభీరంగా, "నా ఆశనూ, అభిప్రాయాన్నీ అర్థం చేసుకున్నందుకు చాలా సంతోషం జయసేనా!



అయితే, నేను ఇంత తొందర పడుతున్నందుకు గల కారణం కూడా చెబుతాను విను!

నా పూర్వీకుడైన జయవర్మ, హారం పోగొట్టుకున్నప్పటికీ చాలా సమర్థవంతంగా పాలించటం చేత, కోసల దక్షిణాపథంలో అగ్రరాజ్యంగానే నిలిచింది. అటు వరుణదత్తుడు రాజ్యాభివృద్ధి చెయ్యాలన్న కాంక్షగల వాడైనప్పటికీ మూర్ఖుడు కావటం చేత, కాంభోజ అభివృద్ధి కుంటినడక గానే సాగింది. ఇక పోతే, వరుణదత్తుడికి, అతడి చివరి రోజుల్లో తాను నర్తకి ద్వారా సంపాదించినది నకిలీహారమనీ, వృద్ధరాజు పథకం వేసి అసలు హారాన్ని ఎక్కడో దాచేశాడనీ గూఢచారుల ద్వారా తెలిసింది. నాటి నుంచి కాంభోజ రాజులు, కోసలతో



నిగూఢ శత్రుత్వం వహించి, అదను దొరికితే చాలు, మట్టుబెట్టో మాయచేసో ఆ హారాన్ని చేజిక్కించుకోవాలని ఎదురుచూస్తూనే వున్నారు. అయితే, హారం ఎక్కడున్నదో కోసల రాజులు కూడా గ్రహించలేక పోవడం చేత, వాళ్ళకు ఈనాటి వరకు ఏం చేసేందుకూ అవకాశం లేకుండాపోయింది.

అయితే, ప్రస్తుతం కాంభోజను పరిపాలిస్తున్న వరుణదత్తుడి వారసుడు గరుడదత్తుడు, తన తండ్రి తాతల కంటే కూడా, హారం విషయంలో పట్టుదలగా వున్నట్టు, మన వేగులు వార్త తెచ్చారు. అంతేకాదు, హారం దొరక్కపోతే, కనీసం హారం ఎక్కడ వున్నదో చెబుతూ వృద్ధరాజు విచిత్రవర్మ వ్రాసి పెట్టిన ఉత్తరాన్నయినా సరే చేజిక్కించుకోవాలని గరుడదత్తుడు చాలా పంతంగా వున్నాడు. ఆ పని మీదే అతడు మనదేశానికి పంపిన ఇద్దరు ముగ్గురు వేగుల్ని, మన వాళ్ళు బందీలుగా పట్టుకున్నారు. దాంతో గరుడదత్తుడు ఇంకేవో పథకాలు వేస్తున్నాడని వార్త తెలిసింది. అయితే, ఆ పథకం ఏమిటన్నది ఖచ్చితంగా తెలియలేదు. ఈ పరిస్థితుల్లో మనం ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా, ఆ హారాన్ని చేజిక్కించుకుని, ఆ తర్వాత కాంభోజ మీదికి దండెత్తటం మంచిదని, నా అభిప్రాయం. అందుకే, మహామహుడైన కృష్ణచంద్రుడు, యువరాజు ప్రయాణానికి పెట్టిన ముహూర్తమే, ఈ మహత్కార్యారంభానికి ముహూర్తమైతే బాగుంటుందని, కృష్ణచంద్రుడి గురుకులం నుంచి బైలుదేరిన కీర్తిసింహుణ్ణి తూర్పు వైపు మళ్ళించాలని ఆలోచించాను! నీ కుమార్తె చురుకుదనమూ, తెలివితేటలూ గమనించిన క్షణం నుంచీ, అతడికి నీ కుమార్తె కూడా తోడైతే బాగుండుననిపించింది. దాని ఫలితమే ఇది! ఇక నీ అనుమానాలన్నీ తీరినట్టేనా?" అని ప్రశ్నించాడు.

జయసేనుడు తలవూపి, "ఇంతకూ యువరాజుకు, ఈ హారం సంగతి ఏమైనా తెలుసా, ప్రభూ?" అని అడిగాడు.

"పూర్వీకుల నాటి ఒక అపూర్వ హారం వున్నదనీ, అది ఎక్కడో గుప్తంగా వుంచబడిందనీ మాత్రం తెలుసు. అంతకుమించి వివ

స్నేహితురాలన్న సంగతి మీరు మర్చిపోయారా, ప్రభూ? కీర్తిసింహుడు ఇప్పటికీ ఆమెను మర్చిపోలేదు. నేను వాడిని చూడడం కోసం గురుకులానికి వెళ్ళినప్పుడల్లా, శక్తిసేన యోగ క్షేమాలు విచారిస్తాడు. శక్తిసేన కూడా మీరన్న దానికి మారు మాట్లాడకుండా ఒప్పుకోవటానికి కారణం, కీర్తిసింహుడే. మీరు ధైర్యంగా వుండవచ్చు, శక్తిసేన మనకు కాబోయే కోడలే!" అన్నది.

రాణి మాటలు విని తేలికపడ్డ మనసుతో సుషేణుడు, "సరే, ఇంతకూ ఆకాశానికి రాజూ, రాణీ ఎవరు?" అంటూ ప్రశ్నించాడు.

వైష్ణవీదేవి నవ్వి, "అదిమాత్రం నేనుచెప్పను! వివాహానంతరం, మనకోడలినే అడిగి తెలుసుకోండి," అన్నది. మహారాజు తృప్తిగా కళ్ళు మూసుకుని, నిద్రకు ఉపక్రమించాడు.

ఇక్కడ కోసలలో ఇలా వుండగా — అక్కడ కాంభోజలో, గరుడదత్తుడు పథకం వెయ్యటం పూర్తయింది. ఈసారి అతడి పథకంలో మరిద్దరు భాగస్వాములు కలిశారు. ఒకడు, కోసలకు ఉత్తరాన వున్న నగదేశపు రాజూ, గరుడదత్తుడి బావమరిదీ అయిన నాగాకర్ణుడు. రెండవవాడు, నగదేశానికీ, కాంభోజకూ మధ్యన వున్న చాక్య దేశపు రాజు కుండినవర్మ.

తానొక్కడే రెండు, మూడు సార్లు గూఢచారుల ద్వారా ప్రయత్నించి భంగపడ్డ గరుడదత్తుడు, ఈసారి మరికొంత సహాయం సంపాదించి, కోసల మీదికి దండెత్తి అయినా సరే, ఆ హారాన్ని చేజిక్కించుకోవాలనే ఉద్దేశంతో, మొదటగా తన బావమరిది అయిన నగదేశాధిపతిని సంప్రతించాడు. నాగాకర్ణుడు, తన స్నేహితుడైన చాక్య రాజుకు కూడా ఇటువంటి ఉద్దేశమే వున్నదనీ, పైగా అతడివద్ద భిల్ల సైన్యం ఎక్కువగా వున్నది గనుక, అతడిని కూడా కలుపుకుంటే బాగుంటుందనీ సూచించాడు.



దీనికి ఫలితంగా, ఏవో ఉత్సవాల పేరిట నాగాకర్ణుడు, కుండినవర్మ కాంభోజలో సమావేశమై, గరుడదత్తుడితో కలిసి మంతనాలు సాగించారు.

హారం గరుడదత్తుడు తీసుకునేటట్టూ, కోసలను మిగతా ఇద్దరూ సమంగా పంచుకునే

టట్టూ నిర్ణయమైంది. కాని, ఎవరికి వారే మిగతా వారిని వంచించి, హారాన్నీ, కోసలనూ కూడా దక్కించుకోవాలని పథకాలు వేసుకున్నారు. తర్వాత కోసలను పడగొట్టటానికి వ్యూహ రచన ప్రారంభమైంది.

"మన ముగ్గురి సైన్యాలూ కలిస్తే ఎంతో, ఒక్క కోసల సైనికశక్తి అంత! అది మనం గుర్తుంచుకోవలసిన సంగతి," అన్నాడు నాగాకర్ణుడు.

"అంతేకాదు, రేపు కృష్ణ పాడ్యమి నాడు గురుకులం నుంచి బయలుదేరి, కీర్తి సింహుడు రాజధానికి తిరిగి వెళ్ళిపోతున్నాడు. అతడు గనక సైన్యాధిపత్యం వహిస్తే, మన పని ఇంకా కష్టతరమవుతుంది," అన్నాడు కుండినవర్మ.

"ఆ కీర్తిసింహుణ్ణే ముందు హతమార్చితే?" అని గరుడదత్తుడు ప్రశ్నించాడు.


"ఎలా?" అని అడిగారు మిగతా ఇద్దరూ అతృతగా.


"మెరికల్లాంటి ముగ్గురు భటుల్ని పంపించి, దొంగచాటుగా దారిలోనే అతణ్ణి చంపిద్దాం! కోసల రాజ్యమంతా యువరాజు మరణానికి శోకంలో మునిగి వుండగా, మనం హఠాత్తుగా దెబ్బ తీద్దాం," అన్నాడు గరుడదత్తుడు.

"ఇంతకంటే అద్భుతమైన ఉపాయం ఇంకొకటి వున్నది! కీర్తిసింహుణ్ణి దొంగదెబ్బ తీసి బంధించి, మర్యాదగా హారం ఇవ్వమనీ, లేకపోతే అతన్ని చంపేస్తామనీ, అతడి తండ్రిని బెదిరిద్దాం," అన్నాడు నాగాకర్ణుడు.

"అవును, అదే మంచి పద్ధతి! మనకు ఆ హారం ఎక్కడున్నదో తెలియదు. రాజు సుషేణుడికి కొడుకంటే ప్రాణాధికమైన ప్రేమ. అతడు చనిపోయాడనీ, మనమే చంపించామనీ తెలిస్తే, హారం ఎక్కడ వున్నదో తెలిపే ఆధారాలనుకూడా నాశనం చేస్తాడు. కొడుకు ప్రాణాల కోసం అంటే, తేలికగా ఆ హారాన్ని అయినా ఇచ్చేస్తాడు. హారం మన చేతికి రాగానే, కీర్తిసింహుణ్ణి చంపేద్దాం," అన్నాడు కుండినవర్మ.

ఇందుకు మిగతా ఇద్దరూ ఆమోదించారు. తరవాత, ముగ్గురు మెరికల్లాంటి భటుల్ని పంపించి, కీర్తిసింహుణ్ణి బంధించి, ఘాటైన మత్తు మందు ఇచ్చి కాంభోజకు తీసుకురావటానికి నిర్ణయించారు. — (ఇంకావుంది)





కీర్తిసింహుడి కథ

4

[జయవర్మ, జయసేనుడు ఇచ్చిన తన తండ్రి ఉత్తరం చదివాడు. ఆ ఉత్తరంలో, అపూర్వహారం ఉన్న చోటు నిగూఢంగా వివరించబడింది. అది జయవర్మకు అంతుబట్టలేదు. అలా ఐదు తరాలు గడిచిపోయాయి. ఇప్పటి రాజు సుషేణుడు, మహిమగలహారం తన కుమారుడు కీర్తిసింహుడికి లభించాలని ఆశించాడు. అందుకే జయసేనుడి కుమార్తె తెలివితేటలను ఉపయోగించుకోవాలనుకున్నాడు. అదేసమయంలో కాంభోజరాజు గరుడదత్తుడు — నగదేశపు రాజు నాగాకర్ణుడితోనూ, చాక్యదేశపు రాజు కుండినవర్మతోనూ కలిసి, అపూర్వహారంతో పాటు కోసల రాజ్యాన్ని కూడా కబళించడానికి కుట్రపన్నాడు. గురుకులం నుంచి తిరిగి వస్తూన్న కీర్తిసింహుణ్ణి బంధించి అపహరించడానికి ముగ్గురూ కలిసి పథకం వేశారు. — తరవాత]

ఇక్కడ కోసలలో శక్తిసేన బయలుదేరనున్న సమయంలోనే, గరుడదత్తుడూ అతడిమిత్రులూ పంపిన ముగ్గురు భటులూ అరణ్యం కేసి బయలుదేరారు.

ఇలా, ఒకరికితెలియకుండా మరొకరు తన కోసమే బయలుదేరి వస్తున్నారన్నవిషయం తెలియని కీర్తిసింహుడు, అక్కడ కృష్ణచంద్రుడి గురుకులంలో విద్య పూర్తి చేసుకుని, స్వదేశానికి ప్రయాణమయ్యే ఉత్సాహంలో వున్నాడు.

అతడు ఎదురు చూస్తున్న కృష్ణ పాడ్యమి రానే వచ్చింది. నాటి తెల్లవారు జామునే లేచి గురువు కృష్ణచంద్రుడి ఆశీస్సులు పొంది, మిత్రుల దగ్గర వీడ్కోలు తీసుకుని, నిర్ణయించబడిన ముహూర్తానికి, తన ఉత్తమాశ్వం భానుమతిని అధిరోహించి బయలుదేరాడు, కీర్తిసింహుడు.

జాము పొద్దెక్కే వేళకు అతడు, ఆరావళీ పర్వత ప్రాంతాల వున్న అడవి మధ్య భాగానికి



చేరుకున్నాడు. అక్కడి నుంచి దిగువకు ఉత్తరంగా ప్రయాణం చేస్తే, కోసల రాజధాని చేరుకోవచ్చు. తూర్పు దిశగా ప్రయాణిస్తే, కోసలకు తూర్పు సరిహద్దున వున్న తూర్పుటడవులూ, అందులోని శక్తి ఆలయమూ, అటు పైన దానికి అవతలవున్న కాంభోజ రాజ్యమూ వస్తాయి.

అక్కడి వరకూ వాయువేగంతో ప్రయాణించిన భానుమతి, ఆ ప్రాంతం చేరేసరికి హఠాత్తుగా ఆగిపోయింది.

ఒక రోజు పాటు ఎక్కడా ఆగకుండా, ఒకే వేగంతో ప్రయాణించగల భానుమతి, ఇంకా అట్టే దూరం రాకుండానే హఠాత్తుగా ఆగిపోవటం, కదలనని మొరాయించటం కీర్తిసింహుడికి ఆశ్చర్యాన్నీ, అనుమానాన్నీ కలిగించింది.

అతడు వెంటనే గుర్రం దిగి, చుట్టు పక్కల అంతా పరీక్షగా చూశాడు. దరిదాపుల్లో ఏ క్రూరమృగమూ వున్న జాడలు లేవు. మరి భానుమతి ఎందుకాగినట్టు?

కొంచెం సేపాలోచించాక కీర్తిసింహుడు, దరిదాపుల్లో తనకు హాని ఏదో కలగబోతున్నదేమోనని అనుమానించాడు.

"మరేం ఫర్వాలేదు, భానూ! ఆ హాని సంగతేదో నేను చూసుకుంటాను, పద!" అంటూ కీర్తిసింహుడు గుర్రాన్నిమెల్లగా చరిచి అధిరోహించబోయాడు.

గుర్రం చిన్నగా సకిలిస్తూ పక్కకు తప్పుకున్నది.

"సరే, కొద్ది దూరం నెమ్మదిగా నడిచి వెళదాం!" అంటూ కీర్తిసింహుడు ఒరలోంచి కత్తి దూసి పట్టుకుని నెమ్మదిగా నడవసాగాడు. భానుమతి అతన్ని అనుసరించింది. ఇద్దరూ నెమ్మదిగా యాభై గజాల దూరం ముందుకు నడిచారు.

ఆ సమయంలో, తన తలపై నుంచి ఏదో అతి సన్నని వస్తువు, వేగంగా గాలిని కోస్తూ వస్తున్న శబ్దం వినిపించి, కీర్తిసింహుడు మెరుపులా తల పైకెత్తి చూశాడు.

అక్కడ వున్న ఒక పెద్ద చెట్టుపైనుంచి, అడవుల్లో క్రూరమృగాలను పట్టుకోవటానికి భిల్లులు ఉపయోగించే సన్నని ఇనుపవల

ఒకటి, అతి వేగంగా కీర్తిసింహుడి మీదికి వస్తున్నది. అతడు తల పైకెత్తి చూసే సరికే, వల అతడి తలను తాకింది.

కీర్తిసింహుడు వెంటనే కత్తితో దాని వేగాన్ని ఆపి, దాన్ని తిరిగి పైకి నెట్టేస్తూ, ఒక్క ఉదుటున ఎగిరి పక్కకు దూకాడు. అతడిని వెన్నంటి వస్తున్న భానుమతి మీదికి ఆ వల జారి, భానుమతి అందులో చిక్కుకుపోయింది.

క్షణంలో తెప్పరిల్లిన కీర్తిసింహుడు, తన నడుమున వున్న చిన్న చురకత్తి తీసి చెట్టు మీదికి విసరబోయాడు. అంతలోనే మరొక వైపు నుంచి చెట్టు మీదికి బాణవర్షం కురవటమూ, ఆ బాణాల తాకిడికి చావుకేకలు పెడుతూ ముగ్గురు భటులు చెట్టుపై నుంచి కిందపడి గిలగిల తన్నుకుని మరణించటమూ క్షణాల మీద జరిగిపోయింది.

ఈ హఠాత్సంఘటనలు చూసి విస్మయానికి లోనైన కీర్తిసింహుడు, కత్తి పైకెత్తి బాణాలు వచ్చిన దిశగా చూస్తూ, "ఎవరక్కడ?" అని కేకవేశాడు.

అతడి ప్రశ్నకు జవాబుగా, ఎదురుగా వున్న చెట్టు చాటు నుంచి, తలపాగా ధరించిన నూనూగు మీసాల యువకుడొకడు ఇవతలికి వచ్చి, కీర్తిసింహుడికి నమస్కరించాడు.

కీర్తిసింహుడు కొంచెం ఆశ్చర్యంగా అతణ్ణి చూసి, "ఎవరు నువ్వు? ఈ చచ్చిన వాళ్ళెవరు?" అని ప్రశ్నించాడు.

"వాళ్ళెవరో నాకూ తెలియదు! వాళ్ళ దుస్తులు వెతకండి, ఏమైనా ఆనవాళ్ళు





దొరకవచ్చు," అన్నాడు యువకుడు విన యంగా.

కీర్తిసింహుడు మారుమాట్లాడకుండా వెళ్ళి, ముందు భానుమతిని వలలోనుంచి తప్పించి, తర్వాత చచ్చిన శత్రుభటుల దుస్తుల్లో ఆన వాళ్ళ కోసం వెతక సాగాడు. అతడు ఆ పనిలో నిమగ్నమై వుండగా, యువకుడు కత్తి చేత బట్టుకుని, శత్రువులెవరైనా వస్తే ఎదుర్కోవ డానికి సిద్ధంగా నిలబడ్డాడు.

ముగ్గురు భటులదుస్తుల్నీ పూర్తిగా వెతికి చూసిన కీర్తిసింహుడికి, ఒకడు కాంభోజ దేశా నికీ,ఒకడు చాక్య దేశానికీ, ఆఖరి వాడు నగ దేశానికీ చెందిన వాళ్ళని మాత్రం తెలిసింది. అయితే, కోసల, కాంభోజ దేశాల మధ్య శత్రుత్వమూ, తరతరాల నాటి కథా కొంత తెలిసివున్న కీర్తిసింహుడు ఆ మూడు దేశాలూ ఏకమై కుట్ర పన్నుతున్నాయన్న విషయాన్ని సులభంగానే గ్రహించగలిగాడు.

తర్వాత అతడు, యువకుడి వైపు తిరిగి, "ఇప్పుడు చెప్పు, ఎవరు నువ్వు?" అని ప్రశ్నిం చాడు. ఆ ప్రశ్నకు యువకుడు మృదుగంభీ రంగా, "ఆ ప్రశ్నకు జవాబు చెప్పబోయే ముందు, నేనొక చిన్న ప్రశ్న అడుగుతాను. జవాబు చెప్పండి," అన్నాడు.

"ప్రశ్నా?" అంటూ ఆశ్చర్యపోయి కీర్తిసిం హుడు, యువకుణ్ణి పరీక్షగా చూస్తూ, "సరే, ఏమిటది?" అని ప్రశ్నించాడు.

యువకుడు కొద్దిగా తల పక్కకు తిప్పు కుంటూ, "ఆకాశానికి రాజూ, రాణీ ఎవరు?" అని ప్రశ్నించాడు.

ఆ ప్రశ్న వినగానే కీర్తిసింహుడు, యువ కుణ్ణి మరింత పరీక్షగా చూస్తూ, చిరునవ్వుతో, "శక్తిసేనా!" అంటూ పలకరించాడు.

యువకుడి వేషంలో వున్న శక్తిసేన తల వంచుకుంటూ, "నాప్రశ్నకు సమాధానం అది కాదు!" అన్నది.

కీర్తిసింహుడు చిన్నగా నవ్వాడు. అతడికి, కార్తీక పౌర్ణమినాడు తల్లితో బాటు కార్తీక దీపోత్సవానికి వచ్చి, ఆకాశంలో తళ తళ మెరుస్తున్న వేన వేల నక్షత్రాల మధ్య వెన్నెల కాంతుల్ని వెదజల్లుతున్న చంద్రుణ్ణి చూసి పరవశించిపోతూ, "అబ్బ! ఆకాశం ఎంత

బాగుందో! నదిలోని దీపాలకంటే, ఆకాశంలో నక్షత్రాలే బాగున్నాయి. ఇక్కడ రాజయ్యేకంటే ఆకాశానికి రాజయితే ఇంకా బావుంటుంది. కీర్తిసింహా! నువ్వు ఆకాశానికి రాజువవుతావా?" అంటూ తనను ప్రశ్నించిన బాల శక్తిసేన మాటలూ, తన జవాబూ గుర్తుకొచ్చాయి.

"ఆహాఁ, నేను తప్పకుండా ఆకాశానికి రాజునై, నిన్ను రాణీని చేస్తాను," అన్నాడా రోజున కీర్తిసింహుడు.

ఆ సంభాషణ విన్న కీర్తిసింహుడి తల్లీ, శక్తిసేన తల్లీ నవ్వుకున్నారు.

శక్తిసేనిప్పుడు, ఆ ప్రశ్నకు తను చెప్పబోయే సమాధానం ద్వారా, తనకు ఆమెపై బాల్యంలో గల అనురాగం ఇప్పుడు వున్నదా లేదా అన్న విషయం పరీక్షించదలచి, ఆ ప్రశ్న అడిగిందని అర్థం చేసుకున్నాడు కీర్తిసింహుడు.

కీర్తిసింహుడు నవ్వుతూ శక్తిసేనను సమీపించి, "ఆకాశానికి రాజు కీర్తిసింహుడు. రాణి శక్తిసేన! సమాధానం సరిపోయిందా, మహారాణీ?" అన్నాడు.

శక్తిసేన సిగ్గుతో తలవంచుకున్నది.

"ఇంతకూ, ఈ వేషంలో నువ్విప్పుడు ఇక్కడి కెందుకొచ్చినట్టు, శక్తీ?" అని ప్రశ్నించాడు కీర్తిసింహుడు.

"స్వయంగా మహారాజే నన్ను పంపారు!" అంటూ శక్తిసేన అంతా వివరంగా చెప్పి, తన దుస్తుల మాటున దాచిన చిన్న దంతపు పెట్టె తీసి కళ్ళకద్దుకుని, అతడి కందించింది.



వెంటనే కీర్తిసింహుడు మరణించిన ముగ్గురు భటులను చూపుతూ, "నువ్విలా ఈ పెట్టెతో బయలుదేరి వస్తున్న వార్త తెలిసి, వీళ్ళు కూడా వచ్చారంటావా?" అన్నాడు సాలోచనగా.

"నేను వస్తున్న వార్త వీళ్ళకు తెలిసే అవకాశం తక్కువ, కీర్తిసింహా! మహారాజు చాలా అవ్యవధిగా, నా ప్రయాణం నిర్ణయించారు. వీళ్ళు కూడా ఆసరికే కుట్రపన్ని వుంటారు," అన్నది శక్తిసేన.

"కావచ్చు! నన్ను బంధించి, నా ప్రాణం పణంగా పెట్టి హారం సంపాయించాలని అనుకుని వుంటారు. ఏది ఏమైనా ఈ కుట్రలో ముగ్గురు దేశాధిపతులు భాగస్వాములని



స్పష్టమవుతున్నది. ప్రస్తుతం మనకున్న వ్యవధి చాలా తక్కువ. వీళ్ళు ముగ్గురూ నన్ను బంధించి అనుకున్న సమయానికి చేరవలసిన చోటు చేరకపోయేసరికి, కుట్రదారులు తిరిగి నా కోసం గాలింపు ప్రారంభిస్తారు. కనుక, మనం సాధ్యమైనంత త్వరగా పని ముగించుకుని నగరం చేరాలి!" అంటూ కీర్తిసింహుడు పెట్టెలోంచి ఉత్తరం తీసి చదివి, "పరమేశ్వరి తల వంచేది ఎవరి ముందు?" అని శక్తిసేనను ప్రశ్నించాడు.

శక్తిసేన నవ్వి, "ప్రశ్న మరొక్కసారి చదువు! పరమేశ్వరి కూడా స్త్రీయే. స్త్రీ తల వంచేది ఎవరి ముందు? తనభర్త ముందు! పరమేశ్వరి తల వంచేది పరమేశ్వరుడి ముందు," అన్నది.

"ఓహో, అదా! ఇక మిగిలినవి తేలిగ్గానే స్ఫురిస్తున్నవి. పరమేశ్వరుడు నివసించేది ఉత్తర దిక్కున! మనిషికి జీవనాధారమైన ఆహారాన్ని ప్రసాదించేదీ, పంచభూతాలలో ఒకటీ అయినది భూమి! భూమి నంతటినీ ఒక్క అడుగుతో కొలిచిన వామనుడు అడిగిన మొత్తం, మూడు అడుగులు!" అన్నాడు కీర్తిసింహుడు.

"ఇంత వరకు గ్రహించటం సులభమే, కీర్తిసింహా! కాని, ఈ ఆధారాలతో హారం ఎక్కడున్నదీ ఎలా తెలుస్తుంది?" అని శక్తిసేన ప్రశ్నించింది.


కీర్తిసింహుడు కొద్దిసేపు ఏమీ మాట్లాడకుండా, ఆలోచిస్తూ వుండిపోయి, చిరవకు, "శక్తీ! ఈ ఆధారాలను బట్టి చూస్తే, హారం శక్తి ఆలయంలో ఉత్తర దిక్కున, భూమిలో మూడడుగుల లోతున పాతి పెట్టి వుంటుందనిపిస్తున్నది!" అన్నాడు.

అతని మాటలు వినగానే శక్తిసేన ముఖం వికసించింది.

కీర్తిసింహుడు కదులుతూ, "పద, శక్తీ! పొద్దు వాలేలోగా మనం శక్తి ఆలయం చేరుకోవాలి," అన్నాడు.

శక్తిసేన అవునన్నట్టు తల వూపింది. ఇద్దరూ తమ గుర్రాలను అడవి చెట్లకిందుగా దౌడు తీయించారు.

వాళ్ళు శక్తి ఆలయం చేరేసరికి, ఇంకా కొంత పొద్దు మిగిలి వున్నది. ఇద్దరూ గుర్రాలు



దిగి ఆలయంలోకి నడిచారు. నిత్యం చూసే వారు లేక, ఆలయ ప్రాంగణమంతా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగివున్నవి. ఆలయం అంతా దుమ్మూ ధూళితో పాటు సాలెగూళ్ళతో నిండి వున్నది.

ఎంతో వైభవంగా వుండవలసిన ఆ ఆలయం, ఇంతటి శిథిలావస్థలోవుండడం చూసే సరికి, శక్తిసేనాకీర్తిసింహులిద్దరికీ హృదయం ద్రవించింది.

కీర్తిసింహుడు, శక్తిసేన వెంట తీసుకు వచ్చిన తాళంచెవులతో, ముఖద్వారం తెరుచుకుని, గుడి లోపలికి అడుగు పెట్టారు. లోపల గర్భగుడిలో, ముక్కున తళ తళ మెరుస్తున్న వజ్రపు ముక్కెరతో నల్లని శక్తి విగ్రహం సాక్షాత్కరించింది.

శక్తిసేన, కీర్తిసింహుడు నేల మీద మోకరిల్లి, శక్తి విగ్రహానికి భక్తితో చేతులు జోడించి నమస్కరించారు.


"అమ్మా, మహాశక్తీ! న్యాయంగా నాదైన సొమ్ము కోసం ఆశపడి వచ్చాను. సొమ్ము నాదైనా, ఫలితం ప్రజలకు పంచిపెడతానని, నీ ముందు ప్రతిన చేస్తున్నాను. నా అర్హతానర్హతలు నాకంటే, నీకే తెలుసు! నీకరుణకు పాత్రుడినైతే చాలు, అంతకు మించిన అర్హత ఏదీ లేదు. నన్ను పాల ముంచినా, నీట ముంచినా ఆ భారం నీదే, తల్లీ!" అంటూ శక్తికి మనసా నమస్కరించి లేచాడు, కీర్తిసింహుడు.


శక్తిసేన అతడిని అనుసరించింది.

ఇద్దరూ ఆలయప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలను తప్పించుకుంటూ, ఉత్తరపు దిశగా వెళ్ళారు. అక్కడ, ఏపుగా పెరిగిన రకరకాల మొక్కల మధ్య, పెద్ద బిల్వవృక్షం ఒకటి వున్నది.

కీర్తిసింహుడు ఆ వృక్షాన్ని సాలోచనగా చూస్తూ, "శక్తీ, చూశావా! మహాశివుడికి అత్యంత ప్రీతి దాయకమైన బిల్వ వృక్షం ఇది. హారాన్ని ఇక్కడే పాతిపెట్టి వుంటారు," అన్నాడు.

"నీ ఊహ నిజమే కావచ్చు. కాని తవ్వటం ఎలా?" అంటూ శక్తిసేన కాస్త నిరుత్సాహంగా ప్రశ్నించింది. —(ముగింపు వచ్చే సంచికలో)





కీర్తిసింహుడ కథ

5

[కీర్తిసింహుడు గురుకులంలో విద్య పూర్తి చేసుకుని, గురువు కృష్ణచంద్రుడి ఆశీస్సులు పొంది రాజధానికి బయలు దేరాడు. ఆరావళి పర్వత ప్రాంతాల అడవిని దాటుతూ వుండగా, అతన్ని బంధించడానికి చాటునుంచి ఇనుప వలను విసిరిన శత్రువుల భటులను పురుష వేషంలో వచ్చిన శక్తిసేన బాణాలతో హతమార్చింది. కీర్తిసేనుడు శక్తిసేనను గుర్తుపట్టి, ఆమె ఇచ్చిన ఉత్తరం చదివి, ఇరువురూ కలిసి అరణ్య మధ్యంలో వున్న దేవీ ఆలయానికి వెళ్ళి, దేవిని ప్రార్థించి హారం కోసం అన్వేషణ మొదలుపెట్టి, ఉత్తరపు దిశగా వెళ్ళి బిల్వ వృక్షాన్ని సమీపించారు. — తరవాత]

కీర్తిసింహుడు మారుమాట్లాడకుండా వెను దిరిగి ఆలయంలోకి వెళ్ళి, కొద్దిక్షణాల్లో, కాస్త తుప్పు పట్టిన త్రిశూలం ఒకదాన్ని చేత బట్టు కుని తిరిగి వచ్చాడు.

అప్పుడు ఎక్కడ తవ్వాలన్న ప్రశ్న ఎదు రైంది.

"బిల్వవృక్షపు మొదట్లో తవ్వి లాభం లేదు. దిగువన వేళ్ళు బాగా విస్తరించివుం టాయి. ఇది ఒక ఆధారం మాత్రమే! దీన్ని ఆధారం చేసుకుని ఎక్కడ తవ్వాలో నిర్ణయిం చుకోవాలి!" అంటూ కీర్తిసింహుడు ఒక్క క్షణం ఆలోచించి, బిల్వవృక్షానికి ఉత్తరపు దిక్కుగా, సరిగ్గా మూడడుగుల తర్వాత నేలను పరీక్షించటం ప్రారంభించాడు.

అక్కడ మొక్కల మధ్య ఒక చతురస్రాకా రపు బండరాయి నేలలో పాతుకుని వున్నది.

"ఇదిగో, ఇదే గుర్తయి వుంటుంది," అని కీర్తిసింహుడు త్రిశూలంతో బండరాయిని

లక్ష్మీగాయత్రి



ఒక్క ఊపున పక్కకు పెళ్ళగించి, అక్కడ తవ్వటం ప్రారంభించాడు.

సరిగ్గా మూడడుగుల లోతు తవ్వగానే అతడికి, ఇసుక మధ్య ఒక చిన్న ఇనప్పెట్టె దొరికింది.

తుప్పు పట్టి శిథిలమై వున్న, ఆ ఇనప్పెట్టె మూత తీసి చూశాడు, కీర్తిసింహుడు. అందులో మరొక చిన్న రాగిపెట్టె ఇమిడి వున్నది. ఆ రాగిపెట్టె మూత తీసి చూస్తే, లోపల మరొక వెండిపెట్టె కనిపించింది. ఆ వెండిపెట్టె మూత తీసి చూస్తే, లోపల ఒక వెండిరేకు కనిపించింది.

ఆ రేకు మీద బంగారు అక్షరాలతో, "సృష్టి, సృష్టికర్త ఇంట, సృష్టికర్త సగభాగంలో ఉన్నది!" అని రాసి వున్నది. ఆ రేకు తప్ప పెట్టెలో మరేమీ లేదు!

అది చూడగానే శక్తిసేన నిరుత్సాహంగా, "మళ్ళీ ఇదేమిటి, కీర్తిసింహా?" అన్నది.

కీర్తిసింహుడు మాత్రం నిరుత్సాహ పడలేదు. రాగిపెట్టెను మళ్ళీ ఇనప్పెట్టెలో పెట్టి, దాన్ని యథాప్రకారం భూమిలో పాతి పెట్టి, వెండి పెట్టెను మాత్రం రేకుతో సహా తన దుస్తుల మాటున జాగ్రత్తగా భద్రపరుచుకున్నాడు.


ఆసరికి బాగా చీకటి పడింది. అయితే, ఆనాడు కృష్ణపాడ్యమి కావటం చేత, కృష్ణ పక్షపు చంద్రుడు వెన్నెల కాంతులు బాగానే వెదజల్లుతున్నాడు.

శక్తిసేనా, కీర్తిసింహులిద్దరూ చుట్టు తిరిగి మళ్ళీ దేవి ఆలయ ముఖద్వారం దగ్గిరకు వచ్చారు.

"పద, మరొక్కసారి శక్తి దర్శనం చేసుకుని, తిరిగి వెళదాం!" అంటూ లోపలికి నడిచాడు కీర్తిసింహుడు.

శక్తిసేన అతణ్ణి అనుసరించింది. ఇద్దరూ పూర్వం లాగే మోకరిల్లి, చేతులు మోడ్చి భక్తితో శక్తికి నమస్కరించారు.

కీర్తిసింహుడు, శక్తికి నమస్కరిస్తూ, "తల్లీ, మహాశక్తీ! నీ దయవల్ల ఇప్పటి వరకూ అంతా సవ్యంగా జరుగుతున్నది. నన్ను నీ కృపకు పాత్రుణ్ణి చేసి, మహోన్నతపీఠం ఎక్కించావు. నిన్ను ప్రతి నిత్యమూ అర్చించి, తరించే





భాగ్యం కూడా ప్రసాదించు, తల్లీ!" అని ప్రార్థించాడు.

అతడి మాటలు పూర్తయిన మరుక్షణంలో, ఆలయమంతా ఒక్కసారిగా దేదీప్యమైన వెలుగుతో నిండిపోయింది. ఆ వెలుగులో నల్లని శక్తి విగ్రహం మరింత ప్రకాశమానంగా కనిపించింది. మహాశక్తి ముఖం, పూర్వం కంటే ప్రసన్నంగా చిరునవ్వుతో వెలిగిపోతున్నది.

శక్తిసేనా, కీర్తిసింహులిద్దరూ, ఆ వెలుగులో జ్వాజ్వల్యమానంగా ప్రకాశిస్తున్న శక్తిని చూసి ముగ్ధులవుతూ సాష్టాంగ ప్రణామం చేశారు.

వాళ్ళు తిరిగి లేచేంతలో, "నాయనా, కీర్తిసింహా! నీ రాజధానీ నగరంలో గల పన్నీటి సరస్సు పక్కనే వున్న మైదాన ప్రదేశంలో, ఒక ఆలయం నిర్మించి, రాబోయే చైత్రశుద్ధ దశమీ శుక్రవారం నాడు, జ్వాలాముఖి అన్న పేరుతో, ఈ మహాశక్తిని అక్కడ ప్రతిష్ఠ చెయ్యి. నీకు సమస్త శుభాలూ కలుగుతాయి!" అన్న అశరీరవాణి వినిపించింది.

ఆ మాటలు విన్న శక్తిసేనా, కీర్తిసింహుల ఆనందానికి మేరలేదు.

వాళ్ళు మళ్ళీ సాష్టాంగ ప్రణామం చేసి, జ్వాలాముఖీదేవికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఆ తర్వాత లేచి ఆలయం బయటికి వచ్చి, ముఖద్వారాన్ని ఎప్పటిలాగా మూసి, తాళం వేసి, బైటికి వచ్చి గుర్రాలెక్కారు.

వాళ్ళు గుర్రాలు అధిరోహించిన మరుక్షణం, మహాశక్తి ఆలయం పూర్వంలాగే అంధకారమయంగా మారిపోయింది.

చంద్రకాంతిలో వాయువేగంతో ప్రయాణించిన శక్తిసేనా, కీర్తిసింహులిద్దరూ, మర్నాటి మధ్యాహ్నం దాటే సరికి రాజధానీ నగరం చేరుకున్నారు.

"శక్తీ, నువ్వు తిన్నగా మీ ఇంటికి వెళ్ళు. నేను త్వరలోనే మహారాజుతో కలిసి, మీ ఇంటికి వస్తాను," అని కీర్తిసింహుడు, శక్తిసేనకు చెప్పాడు.

శక్తిసేన అంగీకారంగా తలవూపి, గుర్రాన్ని తన ఇంటికి నడిపించింది. కీర్తిసింహుడు అంతఃపురం చేరుకున్నాడు.

కొడుకు రాక కోసం ఆతృతగా ఎదురు చూస్తున్న రాజదంపతులు, అతన్ని చూసి

పరమానంద భరితులయ్యారు. కుశల ప్రశ్నలు,పలకరింపులు అయ్యాక, ఏకాంతంలో తండ్రికి జరిగినదంతా వివరించాడు కీర్తి సింహుడు.

అంతా విన్నమహారాజు ఆనందంతో పొంగి పోతూ, "మన జీవితాలు ధన్యమయ్యాయి, నాయనా! దేవి మనల్ని కరుణించి, ఉద్ధరించ బోతున్నది!" అని, "ఇంతకూ హారం సంగతి ఏమయినట్టు?" అని ప్రశ్నించాడు.

"అది కూడా దొరికినట్టే, నాన్నగారూ! ఆ పని మీదే మనం ఒకసారి జయసేనుడి ఇంటికి వెళ్ళవలసి వున్నది," అన్నాడు కీర్తిసింహుడు చిన్నగా నవ్వుతూ.

"సరే, నేటి రాత్రికే వెళదాం!" అన్నాడు సుషేణుడు.

ఆ నాటి రాత్రి భోజనానంతరం, తండ్రీ, కొడుకులిద్దరూ జయసేనుడి ఇంటికి వెళ్ళారు. మహారాజునూ, యువరాజునూ చూసి పరమా నందంతో ఆహ్వానిస్తూ, జయసేనుడు, "నేటి రాత్రికి మీ ఇద్దరూ వస్తారని, నా కుమార్తె చెబుతూనే వున్నది!" అంటూ వారిని ఆద రంగా కూర్చోబెట్టాడు.

జయసేనుడి మాటలకు మహారాజు, కీర్తి సింహుడు ముఖాలు చూసుకుని నవ్వుకున్నారు.

తర్వాతకొద్దిసేపుఏదోసంభాషణ అయ్యాక, మహారాజు,కొడుకుచెప్పినప్రకారం,"జయసేనా! మీ ఇంట పురాతనమైన సరస్వతీ విగ్రహం ఏదైనా వున్నదా?" అని ప్రశ్నించాడు.



మహారాజు ప్రశ్న వినగానే జయసేనుడు ఆశ్చర్యపడుతూ, "ఉన్నది, మహాప్రభూ!" అంటూ లేచి వెళ్ళి, సరస్వతీదేవి కూర్చుని వీణ వాయిస్తున్నట్టుగా వున్న, ఒక దంతపు విగ్రహాన్ని తీసుకొచ్చి మహారాజుకు అందిస్తూ, "దీన్ని మా తాతల నాడు ఎప్పుడో చేయించి పెట్టారట! కాని, మీరుకూడా దీన్నే అడగటం విచిత్రంగా వున్నది, ప్రభూ!" అన్నాడు.

"ఏం, మీ అమ్మాయి కూడా ఈ విగ్రహం కోసమే అడిగిందా?" అంటూ కీర్తిసింహుడు చిరునవ్వుతో ప్రశ్నించాడు.

"అవును, యువరాజా! నా కుమార్తె ఇంటికి వస్తూనే, ఇప్పుడు మహారాజు అడిగినట్టే అడి గింది. నేను కాస్త ఆలోచించి ఈ విగ్రహం



బల్ల మీద పెట్టి, నమస్కరించి, ఒక పక్కగా నిలబడింది.

కీర్తిసింహుడు ఆ భరిణను తీసి తండ్రికి అందించాడు.

సుషేణుడు భరిణ మూత తీసి చూశాడు. అందులో ధగద్ధగాయ మానంగా మెరుస్తున్న నవరత్న పతకంతో, ధవళ కాంతులీనుతున్న ముత్యాలహారం కనిపించింది.

మహారాజు ఆనందాశ్చర్యాలతో దాన్ని చూస్తూ, "ఎక్కడ దొరికిందమ్మా, నీకిది?" అని ప్రశ్నించాడు.

శక్తిసేన వినయంగా, వెండి రేకు మీద రాసి వున్నది చెప్పి, "ఇంటికి తిరిగి వస్తూ ఆలోచించాను. తార్కికంగా – సృష్టించబడిన ప్రతి వస్తువూ సృష్టి, దానిని సృష్టించినవాడు సృష్టికర్తా అవుతారు! ఆ ప్రకారం చూస్తే, ఈ ముత్యాలహారం సృష్టి, మా పూర్వీకుడైన జయసేనుడు సృష్టికర్తా అవుతారు. 'సృష్టికర్త ఇంట' అంటే, మా ఇంట! రెండవసారి చెప్పబడ్డ 'సృష్టికర్త' పదానికి అర్థం బ్రహ్మ కావచ్చునని ఊహించాను. సృష్టికర్త సగభాగం అంటే, బ్రహ్మ దేవుడి అర్ధాంగి సరస్వతీదేవి. అందువల్లనే, ఇంటికి వస్తూనే, ఈ విగ్రహం కోసం నాన్నను అడిగాను. విగ్రహాన్ని సూక్ష్మంగా పరిశీలించగా, లోపల ఈ హారం దొరికింది. తీసి భద్రపరిచాను. వెండి రేకు మీద రాసివున్న దాన్ని, గ్రాహ్యం చేసుకున్న యువరాజు, నేటి రాత్రికే మీతో కలిసి తప్పక ఇక్కడికి వస్తారని

పాతదేనని చెప్పాను. అంతే, దీన్ని తీసుకుని తన గదిలోకి పోయి, చాలాసేపు ఏకాంతంలో గడిపింది. ఆతర్వాత విగ్రహాన్ని తిరిగి ఆ స్థానంలో పెడుతూండగా, కారణం అడిగాను. అప్పుడే, నేటి రాత్రికి మీరు వస్తారనీ, అన్ని వివరాలూ మీరు చెబుతారనీ చెప్పింది," అన్నాడు జయసేనుడు.

కీర్తిసింహుడు చిన్నగా నవ్వుతూ, "అయితే, మాకు కావలసింది, ఈ విగ్రహం కాదు!" అన్నాడు.

అతడి మాటలు పూర్తి కాకుండానే, ఆ గదిలోకి అడుగుపెట్టిన శక్తిసేన, పట్టుగుడ్డలో చుట్టిన చిన్న దంతపు భరిణ నొకదాన్ని కీర్తిసింహుడికీ, మహారాజుకూ ఎదురుగా వున్న



ఊహించి, మా నాన్నగారికి చెప్పాను," అంటూ వివరించింది.

శక్తిసేన మాటలు విన్న ముగ్గురూ చాలా సంతోషించారు.

రాజుసుషేణుడునవ్వుతూ, "అంతాబాగానే వున్నది గాని, జయసేనా! ఇంతకూ మన పందెం సంగతి ఏమైనట్టు?" అని ప్రశ్నించాడు.

మహారాజు మాటలకు శక్తిసేన సిగ్గుతో తలవంచుకున్నది.

ఇక్కడ ఇలా ఆనందం పొంగిపొర్లుతూండగా, అక్కడ కాంభోజలో — కాంభోజ, నగ, చాక్య దేశాధిపతులు ముగ్గురికీ ఆందోళన అధికం కాసాగింది.

మరొక నాలుగు రోజులు గడిచే సరికల్లా, వాళ్ళు పంపిన భటులు అడవిలో మరణించారని వాళ్ళకు తెలిసింది. అంతేగాక, కీర్తి సింహుడు హారాన్ని సంపాయించాడనీ, జ్వాలాముఖీ దేవత అతడికి ప్రసన్నమైందనీ, ఆ దేవత ఆలయ నిర్మాణానికీ, శక్తిసేనా కీర్తి సింహుల వివాహానికీ, కీర్తిసింహుడి పట్టాభిషేకానికీ ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయనీ, వేగులు వాళ్ళకు వార్తలు అందించారు.

ఆ వార్తలు వింటూనే, కుట్రదారులు ముగ్గురూ కుప్పకూలి పోయారు.

వాళ్ళల్లో ముందుగా తేరుకున్న నాగాకర్ణుడు, మిగిలిన ఇద్దర్నీ ఉత్సాహపరుస్తూ, "ఇది మన మంచికే వచ్చింది! కోసల ఉత్సవ సంరంభంలో మునిగి వుండగా, మనం ముగ్గురం సర్వసైన్యాలను కూడగట్టుకుని, హఠాత్తుగా కోసల మీద దాడి చేద్దాం!" అన్నాడు.

ఇందుకు మిగతా ఇద్దరూ అంగీకరించారు.యుద్ధసన్నాహాలుప్రారంభమయ్యాయి.

అయితే, వాళ్ళకు తెలియందేమంటే — కోసలలో నిజానికి జరుగుతున్నవి యుద్ధ సన్నాహాలు. ఉత్సవ సంరంభమంతా కేవలం శత్రువులను పెడదారి పట్టించడానికి పుట్టించిన పుకారు మాత్రమే!

పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న కీర్తిసింహుడు, కుట్రదారుల యుద్ధ సన్నాహాలు సగం కూడా పూర్తి కాకుండానే, ఊహించని విధంగా, యువరాజు హోదాలో సైన్యానికి నాయకత్వం వహించి, పెద్దపెట్టున కాంభోజ

మీద విరుచుకుపడ్డాడు. సైన్యాధ్యక్షుడైన రణ మల్లుడి న్యాయకత్వాన మరికొంత సైన్యం, అటు ఉత్తరాన వున్న నగదేశం మీద దండె త్తింది.

సుశిక్షితులైన కోసల సైనికులు అట్టే శ్రమించకుండానే, కాంభోజ, నగదేశాలు స్వాధీనమయ్యాయి.అటు తర్వాతచాక్య దేశం మీద దండెత్తి, రాజు కుండినవర్మను కూడా బంధించాడు,కీర్తిసింహుడు.

అతడు అంతటితో ఆగక, యుద్ధంలో ఈ మూడు దేశాలకూ సహాయపడిన మరొక రెండు మూడు దేశాల మీదకు కూడా తన సైన్యాన్ని నడిపి, వాటిని కూడా జయిం చాడు.

ఇదంతా గమనించిన నాలుగైదు చిన్న దేశాల రాజులు తమకు తాముగా కీర్తి సింహుణ్ణి శరణు జొచ్చి, తాము అతడికి సామం తులుగా వుంటామనీ,తమను కాపాడవలసిం దనీ ప్రార్థించారు.

విజయోత్సాహంతో కీర్తిసింహుడు కోస లకు తిరిగి వచ్చే సరికి, జ్వాలాముఖీదేవి ఆలయం దాదాపు పూర్తి అయింది. విజయో త్సవాలతో బాటు, అతడి వివాహ సన్నాహాలు కూడా చురుకుగా సాగాయి.

ఇరువురి తల్లిదండ్రులూ, గురువు కృష్ణ చంద్రుడూ ఆశీస్సులు కురిపిస్తూండగా, ప్రజల ఆనందోత్సాహాల మధ్య, శక్తిసేనా, కీర్తిసింహుల వివాహం అత్యంత వైభవంగా జరిగిపోయింది.

ఆ సరికి, చైత్ర మాసం రావటం, జ్వాలా ముఖీదేవి ఆలయ నిర్మాణం పూర్తికావటం, దేవీ విగ్రహాన్ని అడవిలోనుంచి తీసుకురా వటం జరిగాయి.

చైత్రశుద్ధదశమీశుక్రవారంనాడు, మంగళ వాద్యాలు మోగుతూండగా, శక్తిసేనా కీర్తి సింహులు, జ్వాలాముఖీ దేవిని ఆలయంలో ప్రతిష్ఠించారు.

తరతరాలుగా ఎదురు చూస్తున్న శుభ దినం, తమ తరంలో వచ్చినందుకు పొంగి పోతూ, సుషేణుడు, వైష్ణవీదేవి; జయసేనుడు, అతడి భార్య తమ బిడ్డలపై ఆశీస్సుల వర్షం కురిపించారు. — (అయిపోయింది)

